క్లుప్తంగా

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాలలో బెల్టుషాపు నిర్వాహకులను పోలీసులు తహసీల్దార్ రాజు ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం అమ్మకాలు జరపొద్దని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ సూచించారు.

వరల్డ్ హ్యాండ్ వాష్ డే


అవగాహన కల్పిస్తున్న ఫెసిలిటేటర్

గంగాధర: చేతుల శుభ్రతలోనే ఆరోగ్యం ఉందని సగానికి పైగా వ్యాధులను దూరం చేసుకోవచ్చని యూనిసెఫ్ ప్రాజెక్టు క్లస్టర్ ఫెసిలిటేటర్ తాళ్ల వెంకటేశ్ అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని జూనియర్ కళాశాలలో, ఐసీడీఎస్ చొప్పదండి మండల సెక్టార్ సమావేశంలో విద్యార్థులు, మహిళలకు చేతుల శుభ్రత ఆవశ్యకతపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తినడానికి ముందు, మరుగుదొడ్డి వినియోగం తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సౌందర్య, రమాదేవి,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు


బహుమతి ప్రదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో రెండు రోజుల పాటు యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. గ్రామంలోని ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ జట్ల మధ్య వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఐదు జట్లు పోటీలో పాల్గొనగా కుమార్ టీం మొదటి, రాకేశ్ టీం రెండో స్థానంలో నిలిచాయి. సర్పంచ్ మామిడి లత, ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, అజయ్, ప్రవీణ్, స్వామి, మల్లేశం, రవిందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ



గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని చింతలకుంట చెరువు కట్టపై కట్టమైసమ్మ గుడి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన తూడి లచ్చన్న సొంత ఖర్చులతో నిర్మిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. పూజా కార్యక్రమంలో నిర్మాణదాత, సర్పంచ్ ఆకుల శంకర్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ


జావప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశరస్వామి దేవాలయంలో శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ సుద్దాల భాస్కర్ లింగం ఆధ్వర్యంలో సోమవారం పేదలు, భక్తులకు రాగిజావ పౌడర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయప్రకాశ్, వేణు, కృష్ణ, యాంసాని సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు


పరీక్షలు చేయించుకుంటున్న కార్మికులు

చిగురుమామిడి: గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారంటే పారిశుధ్య కార్మికుల కృషి ఎంతో ఉందని చిగురుమామిడి ఎంపీడీఓ ఎం. నర్సయ్య అన్నారు. సోమవారం చిగురుమామిడి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 17 గ్రామాల పారిశుధ్య కార్మికుల రక్తనమూనాలు సేకరించి, ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. పనివేళల్లో తప్పనిసరిగా రక్షణ కవచాలు ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రావణ్‌కుమార్, యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలిటేటర్ రవీందర్, పల్లె దవాఖానా వైద్యులు కార్తిక్, లక్ష్మీప్రసన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మళ్లీ హామీలకే పరిమితమా..?

- దశాబ్దకాలంగా తారుకు నోచుకోని గ్రామీణ రోడ్లు
- ప్రచారానికి వచ్చే నాయకులకు తెగిన రోడ్లు, కల్వర్టుల స్వాగతం
- గత హామీలు నెరవేర్చని పాలకులు
- రోడ్డు సౌకర్యం లేక నరకం చూస్తున్న ప్రజలు


ధ్వంసమైన గొడిశాల-నల్లరామయ్యపల్లి తారురోడ్డు

సైదాపూర్: ప్రజల జీవనాన్ని మెరుగుపర్చడానికి రూ.కోట్లలో నిధులు వెచ్చించి రోడ్లు బాగు చేస్తున్నామని మంత్రులు ప్రకటనలు చేస్తున్నా మట్టి రోడ్లు తారుకు నోచుకోవడం లేదు. పాలకుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలో దశాబ్ద కాలంగా ఏమార్పు లేదు. వానాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో ప్రయాణం కొనసాగుతోంది. మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. నెలరోజులకుపైగానే నేతలు మట్టిరోడ్లపై ప్రచారం చేయనున్నారు. రోడ్లు వేస్తాం, కల్వర్టులు కట్టిస్తామంటారు. గెలిచాక ఇచ్చిన హామీలు అటకెక్కిస్తారని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీల పరిధిలోని రోడ్ల దుస్థితి వర్ణనాతీతం. అక్కడక్కడ ఉన్న తారు రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. తండాలను పంచాయతీలుగా చేశారు. కనీస మౌలిక వసతుల కల్పన చేపట్టలేదు. రోడ్లు, విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలు కరువయ్యాయి.

తారురోడ్లకు నోచుకోని గ్రామాలు

మండలంలోని 16 గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు. ఆ రోడ్లు కూడా సరిగా లేక ప్రజల రాకపోకలకు తీవ్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమారం పంచాయతీ పరిధిలో గర్రెపల్లి, పసికపల్లికి రోడ్డు మార్గం లేదు. ఆరెపల్లి నుంచి వెన్నంపల్లి, జాగీర్‌పల్లికి మట్టి రోడ్డు గుంతలతో ఉంది. గుజ్జులపల్లి నుంచి జాగీర్‌పల్లికి, ఎల్లంపల్లి, గొడిశాలకు మట్టిరోడ్డు. అమ్మనగుర్తి నుంచి నల్లరామయ్యపల్లి, గుండ్లపల్లి నుంచి అమ్మనగుర్తికి, బొమ్మకల్ నుంచి ఘనపూర్‌కు, గొడిశాల నుంచి ఘనపూర్‌కు ఘనపూర్ నుంచి ఘనపూర్ తండా, రాయికల్ తండా, నల్లాని తండాలకు, పెరుకపల్లి నుంచి మండల కేంద్రం వెన్కెపల్లికి మట్టిరోడ్లే దర్శనమిస్తున్నారు. తారురోడ్లు పదేండ్లకు ముందు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించారు. కనీసం ప్యాచ్ వర్కులకు నోచుకోవడంలేదు. సైదాపూర్ నుంచి ఘనపూర్, రాయికల్,రాయికల్ నుంచి బొమ్మకల్, గొడిశాల, రాములపల్లి, ఎలబోతారం వరకు గుంతలు ఏర్పడ్డాయి. బొమ్మకల్ నుంచి అమ్మనగుర్తి వరకు అమ్మనగుర్తి నుంచి గొడిశాల తారురోడ్లు దెబ్బతిన్నాయి. గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంకటేశ్వర్లపల్లి నుంచి ఆకునూర్ గూడెం, పెరుకపల్లి, శివరాంపల్లి, సర్వాయిపేట వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడినా అధికారులు, పాలకుల పట్టింపు కరువైంది.

ఏటా తెగుతున్న నేల కల్వర్టులు, రోడ్లు

వర్షాకాలంలో సైదాపూర్, సోమారం, ఆకునూర్, సర్వాయిపేట నేల కల్వర్టుల వద్ద రోడ్లు తెగుతున్నాయి. కల్వర్టుల వద్ద బ్రిడ్జీలు కట్టాల్సిన అవసరం ఉంది. వానాకాలంలో సోమారం ఆదర్శ పాఠశాల జలదిగ్బంధం అవుతోంది. పాఠశాలకు రోజులతరబడి సెలవు ప్రకటిస్తారు. వరద నుంచి పాఠశాలకు ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం రూ.79 లక్షలు ప్రహరీ నిర్మాణానికి మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పునాదుల వరకే పనులు చేశాడు. ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు ఎన్నోసార్లు ధర్నాలు చేసినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. పెరుకపల్లి చిలుకల వాగు వంతెన తెగి 18 ఏండ్లు కావస్తున్నా, పట్టించుకునేవారు కరువయ్యారు. జూలైలో కురిసిన భారీ వర్షాలకు గర్రెపల్లి, సర్వాయిపేట రోడ్డు కల్వర్టుల వద్ద తెగిపోయాయి. గర్రెపల్లి ప్రజలు రోడ్డు తెగిపోవడంతో అదనంగా ఏడు కిలోమీటర్లు దూరం ప్రయాణం చేస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే నాయకులకు గుంతలరోడ్లు, మట్టి రోడ్లు, తెగిన కల్వర్టులు దర్శనమివ్వనున్నాయి. ఈసారైనా హామీలు నెరవేరుస్తారా లేదంటే ఎప్పటిలాగే మర్చిపోతారా అనేది వేచిచూడాల్సిందే.


తెగిన గర్రెపల్లి - సైదాపూర్ కల్వర్టు


సైదాపూర్ రోడ్డుపై నీటి ప్రవాహం (ఫైల్)


తారుకు నోచుకోని ఆరెపల్లి-జాగీర్‌పల్లి మట్టిరోడ్డు

ఆహ్వాన పత్రిక అందజేత


ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయంలో నిర్వహించే శ్రీచక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈసందర్భంగా సోమవారం హన్మకొండలోని ఆయన స్వగృహంలో ఆలయ అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈసందర్భంగా వినయ్‌భాస్కర్ రూ.51.116 విరాళం అందజేశారు, లోక కల్యాణార్థం నిర్వహించే కార్యక్రమానికి తనవంతు సహాయ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు శ్రీ చక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో బద్దం తిరుపతిరెడ్డి, బద్దం లచ్చిరెడ్డి, సాయిని తిరుపతి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

గంగాధర: మండల కేంద్రంలోని పంటపొలాల్లో పేకాట స్థావరంపై ఎస్ఐ అభిషేక్ సోమవారం రాత్రి దాడి చేశారు. 11 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి రూ.51,250, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంగాధరలో అసాంఘిక కార్యక్రమాలకు చోటులేదని, ఇలాంటి చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదని ఎస్సై పేర్కొన్నారు.

చొప్పదండి అభివృద్ధే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గంగాధర: ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రెండోసారి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో నియోజకవర్గ నాయకులతో కలిసి మాట్లాడారు. సాగునీటి సమస్యతో సతమతమైన చొప్పదండి నియోజకవర్గాన్ని కోనసీమగా మార్చామని, ఎన్నికల సమయంలో వచ్చిపోయే నాయకులను నమ్మవద్దని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలుఅందజేస్తున్నామన్నారు. మోతెకాలువల పనులు పూర్తయితే 30 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని, త్వరలోనే నారాయణపూర్ కుడికాలువ పనులు పూర్తవుతాయని, మంగపేట నిర్వాసితులకు పరిహారం ఇప్పించానని, నారాయణపూర్ నిర్వాసితులకు త్వరలో పరిహారం అందతుందన్నారు. ఆరు మండలాల్లో 52 గ్రామ పంచాయతీలకు సొంతభవనాలు, 54 పల్లె దవాఖానాలు ఏర్పాటు, రూ. 1800 కోట్లతో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి చేశామన్నారు. ప్రత్యేక తెలంగాణలో సంక్షేమ పథకం పొందని ఇల్లు లేదన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేడిపల్లి సత్యం

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో చొప్పదండి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సోమవారం ప్రారంభించారు. సత్యం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పద్మాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిగౌడ్, రాజేశం, ఆదిరెడ్డి, అశోక్, గంగయ్యగౌడ్, అనిల్, శ్రీనివాస్, సంతోశ్ రెడ్డి, రమేశ్‌గౌడ్, రాములు, శంకర్ పాల్గొన్నారు.

రసమయి, కవ్వంపల్లి స్థానికేతరులు


మాట్లాడుతున్న ఆరెపల్లి మోహన్


శంకరపట్నం: రాబోయే 2027 అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గం జనరల్‌కు కేటాయించనున్నారని, ఇవే నాకు చివరి ఎన్నికలని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుచేశానని, పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రసమయి బాలకిషన్ నయాపైసా నిధులు మంజూరు చేయలేదని, రసమయి, కవ్వంపల్లి సత్యనారాయణ స్థానికేతరులని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులుపాలు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లు కాలిపోవడానికి కారణం ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్నారు. సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు అనిల్, దండు కొమురయ్య, మాడ వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రాములు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు'

చొప్పదండి: పండుగలకు ఆన్‌లైన్‌లో అంతర్జాతీయ కంపెనీలు పెట్టే ఆఫర్ లాగా బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టో ఉందని, ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొంకటి శేఖర్ విమర్శించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... గత ఎన్నికల హామీలు, మేనిఫెస్టోను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ సర్కారు విఫలమైందని మళ్లీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాల ఊసే లేదనది, నిరుద్యోగుల ప్రస్తావన లేదని, కౌలు రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో పిట్ట మనోహర్, మహ్మద్ షమీమ్, ఇరుగురాల రమేశ్, విక్రమ్, బషీర్, రోహిత్, మహేశ్, రిషి, శ్రీనివాస్, సంజీవ్, నవీన్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

సాక్షి స్పందన



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పరిధిలోని లాలయ్యపల్లి ఎస్సీకాలనీ క్రాసింగ్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల 11న సాక్షిలో ప్రచురితమైన వృథాగా మిషన్ భగీరథ నీరు అనే కథనానికి అధికారులు స్పందించారు. రెండు రోజులుగా లీకేజీ అవుతున్న చోట జేసీబీ సాయంతో తవ్వి మరమ్మతు చేపట్టారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... లీకేజీ విషయం తమ దృష్టికి రాలేదని ఎప్పుడో మరమ్మతు చేసేవారమన్నారు.

హుజూరాబాద్ జిల్లా ఏర్పాటుకు సహకరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ కేంద్రంగా పీవీ జిల్లా ఏర్పాటుకు సహకరించాలని జిల్లా సాధన జేఏసీ నాయకులు సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బీమోజు సదానందం, ఆలేటి రవీందర్, వేల్పుల రత్నం,తాటిపల్లి రాజన్న, చందుపట్ల జనార్దన్, పోడిశెట్టి వెంకటరాజం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, సందేల వెంకన్న, పులి జగన్నాథం, రామ్ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత మండపాల్లో పూజలు


గంగాధర: పూజలు చేస్తున్న మహిళలు

గంగాధర: రామడుగు మండలం గోపాల్‌రావుపేట బస్టాండ్ సమీపంలో నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని నెలకొల్పారు. ఈసందర్భంగా మండపంలో సోమవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు రెండో రోజు బ్రహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

పరిశోధనలపై ఆసక్తితో ముందుకురావాలి

కరీంనగర్: ప్రస్తుత పరిస్థితుల్లో పరిశోధనలపై ఆసక్తితో యువత ముందుకు రావాలని మహిళా డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ భూపతి రజనీదేవి అన్నారు. మౌంట్‌అబు రాజస్తాన్‌లోని ప్రముఖ అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ అకడమిక్ రీసెర్చ్ యోగిక్ సైన్స్, ఎడ్యుకేషన్ వింగ్‌కు భూపతి రజనీదేవి పర్యవేక్షణలో అట్ల శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదనపత్రం అందుకున్నారు. అట్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థుల్లో ధ్యానం ప్రాముఖ్యత, తల్లిదండ్రుల పెంపకంలో శైలి, భావోద్వేగ మేధస్సుపై విశ్లేషణాత్మక అధ్యయనం శీర్షికతో పరిశోధన ప్రతిపాదనపత్రం తయారుచేసినట్లు తెలిపారు. దీనిపై విస్తృతస్థాయిలో సమాచారం సేకరించి, విశ్లేషణాత్మక పరిశోధన చేయనున్నట్లు, ఈ పరిశోధన భవిష్యత్ తరానికి దిక్సూచిలా పని చేస్తుందన్నారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీలో కలవరం


మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీలో కలవరం మొదలైందని సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. హుస్నాబాద్‌లో సీఎం సభకు అనుకున్న దానికంటే ఎక్కువ జనం వచ్చారని, ముందుగానే పార్టీ అభ్యర్థులను ప్రకటించి బీఫాం అందజేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీ డీలా పడిపోయాయని ఎద్దేవా చేశారు. ఎలక్షన్ నిధుల కోసం కాంగ్రెస్ నాయకులు కర్ణాటకకు వెళ్తున్నారని ఆరోపించారు. మేనిఫెస్టోకు ప్రజల నుంచి స్పందన వచ్చిందన్నారు, బీఆర్‌ఎస్‌లో మొన్నటి వరకు కొనసాగిన ఆరెపల్లి మోహన్ నిధులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజ్, నాయకులు పిట్టల మధు, ఉండింటి సామ్సన్, పడాల శంకరయ్య ,ఎరుకల శ్రీనివాస్ గౌడ్, శాతరాజు యాదగిరి, దండబోయిన శేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


బీఆర్‌ఎస్ పార్టీలో చేరినవారితో పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

హుజూరాబాద్: పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీజేపీకి చెందిన యూత్ నాయకులు, కార్యకర్తలు సుమారు 200 మంది ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చేరినవారిలో ముఖ్య నాయకులు జవ్వాజి కుమారస్వామి, యాద్గా అరవింద్, రాపర్తి అఖిల్, పొన్నాల అనిల్, ఎండీ జానీ, విజయగిరి రాకేశ్, కనుకుల రాజు, గోనె రాజు, ప్రవీణ్, వీరస్వామి బ్రహ్మం, మహమ్మద్ పాషా, మహ్మద్ ఆసిఫ్, శ్రీకాంత్, బన్నీ, వంశీ తదితరులున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, జమ్మికుంట వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటీ, మాజీ వైస్ ఎంపీపీ చుక్క రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పుతున్న ఎమెల్యే రసమయి

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ ఎంపీటీసీ అంతం లత దంపతులు సోమవారం రాత్రి మానకొండూర్‌లో ఎమెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీకి చెందిన ఎంపీటీసీతోపాటు పలువురు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, జెట్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, మండల అధ్యక్షుడు మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ పథకాలను తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్

మానకొండూర్: గడపగడపకూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాలని జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ కార్యకర్తలను కోరారు. మండలంలోని వెల్ది, రంగపేట గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని, మూడోసారి రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రవరం లక్ష్మి, సాయికుమార్, ఎంపీటీసీ పద్మ ప్రభాకర్, ముంజంపల్లి సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.